సార్వత్రిక ఎన్నికల్లో
ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



గాజులరేగలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనాన్ని నిలువరించటం ఎవరి తరం కాదని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ అన్నారు. నగరంలోని 49వ డివిజన్ మెయిన్‌రోడ్, గొల్లవీధిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కోలగట్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మన్యాల కృష్ణ మాట్లాడుతూ.. కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో విజయనగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మీ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని భావిస్తే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కోలగట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, కనుగుల రాజా మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజావసరాలను తీర్చారన్నారు. గతంలో గాజులరేగ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉండేదని, కోలగట్ల పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత తాగునీటి ఇక్కట్లను పరిష్కరించారని సంతోషం వ్యక్తం చేశారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పాలన సాగితే, నగరంలో కోలగట్ల దాన్ని ప్రజలకు చేరువ చేశారన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు కోలగట్లకు అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జమ్ము మధు, బొడసింగి ఈసు, జామాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



భోగాపురం: రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న 18 మంది వలంటీర్లు తమ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్‌కు సోమవారం రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కార్యకర్తలు ఉంటూ నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బడ్డుకొండ అప్పలనాయుడును ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించుకోవడం ద్వారా మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుంటామన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దాసరి చంద్రశేఖర్, లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చిల్లా దుర్గవెంకటలక్ష్మి అభినందనలు తెలియజేశారు.



పూసపాటిరేగ: రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందచేస్తున్న కొప్పెర్ల వలంటీర్లు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న 12 మంది వలంటీర్లు సోమవారం రాజీనమా చేశారు. కార్యదర్శి ఉమాశంకరికి రాజీనామా పత్రాలను అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..నిస్వార్థ సేవలందిస్తున్న తమపై ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెంది రాజీనామాలు చేసినట్లు చెప్పారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, తామను మళ్లీ వలంటీర్లుగా నియమిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్డుకొండ అప్పలనాయుడుని ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించుకునేందుకు తమ వంతు కృషిచేస్తామన్నారు.

జొన్నాడలో 14 మంది

డెంకాడ: మండలంలోని జొన్నాడ గ్రామ సచివాలయం పరిధిలో 14 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారని అధికారులు తెలిపారు. వాటిని ఆమోదించినట్టు ఎంపీడీఓ లవరాజు తెలిపారు.

నేడు విజయభావన సాహితీ సమాఖ్య వార్షికోత్సవం

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 39వ వార్షికోత్సవం స్థానిక లయన్స్ క్లబ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, బహుభాషానువాదకుడు యల్లపు ముకుందరావు(హైదరాబాద్)కి డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే దామరాజు శంకరం అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో వెలుగు వృద్ధాశ్రమం నిర్వహకుడు డాక్టర్ ఖలీల్‌బాబుకి చెందిన టిర్రకోట మృణ్మయ కళారూపాల ప్రదర్శన, అనంతరం రసరమ్యం పేరుతో కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ రచన పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన డాక్టర్ మండ రామప్రసాద్‌కు ఆచార్య భావన స్మారక పురస్కారాన్ని సంస్థ గౌరవాధ్యక్షులు పీవీ నరసింహరాజు (బుచ్చిబాబు) అందజేస్తారన్నారు. సాయంత్రం సభలో అభినయ సంధ్య ఏకపాత్రాభినయం, అనంతరం డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, ఇబ్రహీమ్ ఖాన్‌ల నాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. సాహితీవేత్తలు, అభిమానులందరూ హాజరుకావాలని కోరారు.

నీటి పొదుపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీఈ కోఆర్డినేటర్ విజయబాబు

భోగాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నీటి పొదుపుపై జిల్లా జలజీవన్ మిషన్ ఐసీఈ కోఆర్డినేటర్ జి.విజయబాబు సోమవారం అవగాహన కల్పించారు. తమ ఇంట్లో వాడుతున్న నీరు బయటకు పోకుండా ఇంటి ఆవరణలోనే ఇంకుడు గుంతలు తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనివల్ల నీరు వృథా అవ్వకుండా భూమిలో ఇంకుతుందని, ఫలితంగా భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు ప్రతినిధులు ఎం.రాఘవరావు, లక్ష్మణ్, ఉపాధ్యాయులు సుమంతి, చిన్నారి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ బట్టా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

విజయనగరం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపులపై ఐదు శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు సోమవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ లోపు ముందస్తు చెల్లింపు చేసిన వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందన్నారు. పన్నులు చెల్లించడానికి వీలుగా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. మంగళవారం ఉగాది పండగ సందర్భంగా కార్యాలయానికి సెలవు దినం కావడంతో ప్రజలు బుధవారం నుంచి కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న యుజవన నాయకులు ఈశ్వర్‌కౌశిక్, ఎంపీపీ అప్పలనాయుడు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఈశ్వర్‌కౌశిక్, ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ప్రజలను ఏవిధంగా మోసం చేశారో ఇంటింటికీ తీసుకువెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్ యువజన విభాగంపై ఉందని జిల్లా యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నారాయణపురం గ్రామంలో యువజన విభాగం కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. దేశ చరిత్రలోనే 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ వల్ల పౌరసేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పింఛన్లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిస్తుంటే.. చంద్రబాబు అండ్ కో ఏవిధంగా అడ్డుకున్నారో కూడా వివరించాలన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాలను వివరించాలని సూచించారు. 58 నెలల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చేస్తున్న ఆరోపణలు, అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మళ్లీ కోలగట్ల వీరభద్రస్వామిని ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, యుజవన విభాగం మండల అధ్యక్షులు కోరాడ రవికుమార్, పార్టీ నాయకులు సువ్వాడ శ్రీను, యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై దృష్టి సారించండి



ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఉగాది ప్రత్యేక పుస్తకాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

విజయనగరం టౌన్: నాన్‌షెడ్యూల్డ్ ఏరియాల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యలపై దృష్టిసారించాలని ఉద్యోగ సంఘ నాయకులు సోమవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు దొర, శంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోనుకావద్దు: సీఐ



హనుమాన్‌నగర్ వాసులతో మాట్లాడుతున్న సీఐ రామారావు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు అన్నారు. పూల్‌బాగ్ కాలనీ హనుమాన్ నగర్‌లో సోమవారం రాత్రి ప్రజలతో మమేకమయ్యారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఓటర్లందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మా.. చల్లగా చూడమ్మా..

విజయనగరం: జిల్లా కేంద్రంలోని మంగళవీధిలో ఉన్న నూకాలమ్మ ఆలయ 66వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంతమంతా డప్పు వాయిద్యాల మోతతో మార్మోగింది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయం వద్ద డప్పువాయిద్యాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

క్లుప్తంగా

నూకాలమ్మను దర్శించుకున్న కోలగట్ల



నూకాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ముల్లోకాలను ఏలే నూకాలమ్మ దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కోరుకున్నారు. స్థానిక కర్రల మార్కెట్లో ఉన్న నూకాలమ్మ ఆలయ 66వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరిపై అమ్మవారి కటాక్షం ఉండాలని, కుటుంబాలతో సంతోషంగా వర్ధిల్లాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఏటా ఉగాది సమయంలో అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నూకాలమ్మ యువజన సంఘం అధ్యక్షుడు యడ్ల రాజేష్, మాజీ కౌన్సిలర్ చాట్ల భాస్కరరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సెంచూరియన్ స్కాలర్‌కు అభినందన



నరసింహరాజును అభినందిస్తున్న వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో స్కాలర్ జేవీ నరసింహరాజును వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి సోమవారం అభినందించారు. ఎలక్ట్రిక్ డిస్చార్జ్ యంత్రాన్ని ఉపయోగించి ఎస్‌ఎస్ 630 లోహాలపై చేసిన పరిశోధనకు గాను నరసింహరాజు ఇటీవల పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, మల్యాడ గ్రామానికి చెందిన కొత్తూరు ఈశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈశ్వరరావు మృతితో ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉంది. విషయం తెలుసుకున్న ఈశ్వరరావు స్నేహితులు మానవత్వంతో స్పందించి విరాళాలు సేకరించారు. రూ.20 వేలు సేకరించి సోమవారం ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కాల్‌సెంటర్ ఏర్పాటు

విజయనగరం: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారానికి వీలుగా ప్రత్యేక కాల్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు శనివారం తెలిపారు. కార్పొరేషన్ ద్వారా పౌరులకు అందుతున్న సేవలలో లోపాలు ఉన్నట్లయితే కాల్ సెంటర్ నంబరు 98499 06486కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వాటిపై విచారణ చేపట్టి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలువలలో పేరిగిపోయిన చెత్తాచెదారాలు, వీధి దీపాల సమస్య, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు, ఇతరత్రా ఇబ్బందులు ఉన్నట్లయితే కాల్ సెంటర్ నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట షిర్డిసాయి ఆలయం మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. ఈ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు అతిసమీపంలోకి వచ్చేంత వరకు కనిపించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని కొత్తచెరుకుపల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ రవికుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంతవరకు తిరిగి రాకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.